క్లుప్తంగా

సీఎం రిలీఫ్ చెక్కు అందజేత

బోడుప్పల్: 6వ డివిజన్ పరిధిలో నివసించే యాదిరెడ్డి అనారోగ్యంతో హాస్పిటల్‌లో చేరగా ఆయనకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును మేయర్ సామల బుచ్చిరెడ్డి అందజేశారు. మంగళవారం ఆయన కుటుంబ సభ్యులకు రూ.1.55 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్‌ను తొలగించాలి

మల్లాపూర్: టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డిని తక్షణమే విధుల నుంచి తొలగించాలని దళిత జన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కో ఆర్డినేటర్ బొజ్జ రాకేష్ డిమాండ్ చేశారు. మంగళవారం నాచారంలో దళిత జన స్టూడెంట్ ఫెడరేషన్ సమావేశం నిర్వహించారు. బొజ్జ రాకేష్ మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీలో ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఏ పోటీ పరీక్షలనూ సక్రమంగా నిర్వహించలేదని ధ్వజమెత్తారు. తక్షణమే సభ్యులను తొలగించి అర్హులతో భర్తీ చేయాలని కోరారు. భవిష్యత్‌లో పోరాటాలు తప్పవని హెచ్చరించారు. దళిత జన స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు మజీద్, ఇప్పల పరమేశ్వర్, పల్లె పాండు ఉన్నారు.

శాస్త్రవేత్తలుగా ఎదగాలి

రామంతాపూర్: హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ రామంతాపూర్‌లో ఇస్ యు ఫార్మ్ ప్రైవేట్ లిమిటెడ్‌వారి సహకారంతో వ్యవసాయాన్ని ఏ విధంగా చేయాలనే అంశాలపై మంగళవారం విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. స్కూల్ ప్రాంగణంలో వివిధ రకాల ఆకుకూరలను సాగు చేయించారు. స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ సల్లారం నరసింహారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఐటీ ఇతర ఇంజినీరింగ్ విద్యారంగాలతో పాటు వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం ఇస్తూ సంబంధిత కోర్సుల్లో వ్యవసాయ శాస్త్రవేత్తలుగా ఎదిగి దేశానికి సేవ చేయాలన్నారు. కార్యక్రమంలో ఐస్‌యు ఫార్మ్ ప్రతినిధులు ప్రీతి తదితరులు పాల్గొన్నారు.

'గాంధీ డైట్'కు టెండర్ల ఆహ్వానం

గాంధీఆస్పత్రి : సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, వైద్యులకు ఆహార పదార్థాలు సరఫరా చేసేందుకు డైట్ టెండర్లకు ఆహ్వానిస్తున్నట్లు ఆస్పత్రి పాలన యంత్రాంగం తెలిపింది. 17వ తేదీ వరకు దరఖాస్తులు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

అర్హులందరికీ పట్టాలిస్తాం



కాప్రాలో పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్లు శ్రీదేవి, స్వర్ణరాజ్, శిరీషారెడ్డి

కుషాయిగూడ, కాప్రా: ఉప్పల్ నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పట్టాలు అందేలా చూస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. చర్లపల్లి, కాప్రా, ఏఎస్‌రావునగర్ డివిజన్లకు చెందిన లబ్ధిదారులకు ఎర్ర లలితా గార్డెన్‌లో, మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్‌కు చెందిన లబ్ధిదారులకు యాదగిరి ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమాల్లో స్థానిక కార్పొరేటర్లు, రెవెన్యూ అధికారులతో కలిసి మంగళవారం పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే

ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి

మాట్లాడుతూ ఎంతో కాలంగా అమలుకు నోచుకోని పేదల పట్టాల పంపిణీ చేపట్టిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 58 జీవో పేదలకు ఎంతో మేలు చేసిందన్నారు. ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చుకొని నిర్మించుకున్న ఇళ్లను క్రమబద్ధీకరించి పట్టాలు అందజేసి పేదల ముఖాల్లో వెలుగులు నింపారన్నారు. రానున్న రోజుల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ పట్టాలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. ఇప్పటికీ దరఖాస్తు చేసుకోని వారు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పించిందన్నారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే సొంతమన్నారు. కార్యక్రమాల్లో కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి, ప్రభుదాస్, పన్నాల దేవేందర్‌రెడ్డి, స్వర్ణరాజ్, సింగిరెడ్డి శిరీషా సోమశేఖరరెడ్డి, ఉప్పల్, కాప్రా తహసీల్దార్లు గౌతమ్‌కుమార్, అనిత, మాజీ కార్పొరేటర్లు గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, కొత్త రామారావు, సింగిరెడ్డి ధన్‌పాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్, జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, గడ్డం రవికుమార్, సుధాకర్, కాసం మహిపాల్‌రెడ్డి, డప్పు గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కోర్టు బిల్డింగ్ నిర్మాణానికి కృషి చేయండి



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తూ..

అల్వాల్: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కోర్టు కాంప్లెక్స్ బార్ అసోసియేషన్ నూతన కమిటీ ప్రతినిధులు మంగళవారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కోర్టు బిల్డింగ్ నిర్మాణానికి ఎదురవుతున్న అడ్డంకులను కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే త్వరలో సీఎంను కలిసి పరిస్థితులను వివరిస్తానని, తన శక్తి మేరకు బిల్డింగ్ నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, ఉపాధ్యక్షుడు తుమ్మ కిరీట్‌రెడ్డి, కార్యదర్శి రాజుయాదవ్, సంయుక్త కార్యదర్శి బాపిరెడ్డి, మాజీ అధ్యక్షులు యాదగిరిరావు, అబ్బా రమేష్, లక్ష్మీనర్సయ్య, కొంపల్లి మున్సిపాలిటీ స్టాండింగ్ కమిటీ సభ్యులు సీహెచ్ కృష్ణ, పెంచల సురేందర్‌రావు, సీనియర్ న్యాయవాదులు లక్ష్మీనరసింహం ఉన్నారు.

త్వరలోనే సమస్యలకు పరిష్కారం

వెంకటాపురం డివిజన్ కమలాలయ ఎన్‌క్లేవ్‌లో అస్తవ్యస్తంగా మారిన డ్రైనేజీ వ్యవస్థతో కాలనీ మొత్తం దుర్గంధంతో పాటు దోమల స్వైర విహారం ఎక్కువైందని స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావుకు కాలనీవాసులు మొరపెట్టుకున్నారు. కాలనీవాసుల ఫిర్యాదు మేరకు మంగళవారం ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, కూకట్‌పల్లి నియోజకవర్గం బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నరసింహయాదవ్, కూకట్‌పల్లి మున్సిపల్ అధికారులు, వెంకటాపురం డివిజన్ కార్పొరేటర్ సబితకిషోర్, అల్వాల్ సర్కిల్ అధికారులు మంగళవారం కమలాలయ ఎన్‌క్లేవ్‌లో పర్యటించి సమస్యను సమీక్షించారు. మున్సిపల్ ఉన్నతాధికారులతో ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు మాట్లాడి సమస్యలకు పరిష్కారం చూపారు. బాక్స్‌డ్రైన్‌తోనే సమస్యకు పరిష్కారం లభిస్తుందని, అందుకు వెంటనే నిధులు మంజూరు చేసి వర్షాకాలం ప్రారంభం అయ్యేలోగా నిర్మాణ పనులను పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి సర్కిల్ అధికారులు డీఈ బాలకృష్ణ, ఏఈ అరవింద్, అల్వాల్ సర్కిల్ అధికారులు ఏఈ అరుణ్, కాలనీ అధ్యక్షుడు వినోద్‌కుమార్, కార్యదర్శి డీవీఎస్ శాస్త్రి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల్లో సిబ్బంది పాత్ర కీలకం



బోడుప్పల్‌లో పారిశుద్ధ్య కార్మికులకు కిట్స్‌ను అందజేస్తున్న మేయర్ బుచ్చిరెడ్డి

బోడుప్పల్: పారిశుద్ధ్య పనుల్లో సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి అన్నారు. బోడుప్పల్‌నగర పాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం పారిశుధ్య కార్మికులకు సబ్బులు, నూనెలు, మాస్కులు, రెయిన్ కోట్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బందికి సంవత్సరానికి సరిపడా సబ్బులు, 12, బట్టలు సబ్బులు 12, లీటర్ కొబ్బరి నూనె, 2 జతల గ్లౌజులు, జత చెప్పులు, జత మాస్కులు, సేఫ్టీ అప్రాన్–2, రెయిన్ కోట్ వాటన్నింటితో ఒక కిట్‌గా అందజేసినట్లు వెల్లడించారు. సిబ్బంది కూడా సక్రమంగా విధులను నిర్వహించి నగర ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. మేనేజర్ మంజులత, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జాన్‌పాల్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం

ఏడో డివిజన్ పరిధిలోని లక్ష్మీనగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంధత్వ నివారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి కంటి అద్దాలను అందజేస్తోందన్నారు. ఈ నెల 4వ తేదీ నుంచి 13వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని, అవకాశాన్ని స్థానిక కాలనీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు కాటపల్లి రాంచంద్రారెడ్డి, లక్ష్మీనగర్ కాలనీ అధ్యక్షుడు అమర లింగారెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజాగౌడ్, మాజీ అధ్యక్షుడు చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత లోపిస్తే ఊరుకోం

ఉప్పల్: ఉప్పల్ సౌత్ స్వరూప్‌నగర్‌లో రూ.72 లక్షలతో కొనసాగుతున్న సీసీ రోడ్డు పనులను మంగళవారం ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డి జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. కొన్నేళ్లుగా కంకర తేలిన రోడ్డుతో స్థానికులు ఇబ్బందులు పడ్డారని, కాలనీవాసుల వినతి మేరకు అధునాతన సీసీ రోడ్డు వేయిస్తున్నట్లు తెలిపారు. వీటితో పాటు వరద వచ్చినప్పుడల్లా నాలా పరివాహక ప్రాంతాలు ముంపునకు గురయ్యేవని, సమస్య తిరిగి పునరావృతం కాకుండా నాలా చుట్టూ రిటర్నింగ్ వాల్‌తో ఫెన్సింగ్ చేయిస్తున్నట్లు వివరించారు. నాణ్యత విషయంలో కాంట్రాక్టర్లు రాజీపడొద్దని సూచించారు. కార్యక్రమంలో పరమేశ్వర్‌రెడ్డి, ఏఈ వసంత, కాలనీ అధ్యక్షుడు వెంకటరెడ్డి, నాయకులు తాటి కొండ రమణ, బాకారం లక్ష్మణ్, ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు

ఇఫ్తార్ విందుకు పరమేశ్వర్‌రెడ్డి

రంజాన్ ఉపవాస దీక్షల సందర్భంగా చిలుకానగర్ డివిజన్ మైనార్టీ నాయకులు షరీఫ్ ఆధ్వర్యంలో మంగళవారం ఇచ్చిన ఇఫ్తార్ విందుకు మాజీ కార్పొరేటర్ మందముల పరమేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో కొంపల్లి బాలరాజ్, రఫిక్, రఘు, మంచాల రఘు పాల్గొన్నారు.

పూడిక పనుల్లో వేగం పెంచండి

మల్కాజిగిరి: నాలా పూడిక పనుల్లో వేగవంతం చేయాలని ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. మంగళవారం సత్తిరెడ్డినగర్‌లో రూ.32 లక్షలతో జరుగుతున్న నాలా పూడిక పనులను ఆయన పరిశీలించారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే నాలాల పూడిక పనులు పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో డీఈ లౌక్య, ఏఈ శ్రీకాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రజినీకాంత్, బాబు, సత్యనారాయణ, సంపత్, కిషోర్ పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరా ఉండని ప్రాంతాలు

ఉప్పల్: కృష్ణాఫేజ్–3 తాగునీటి పైపులైన్ మరమ్మతుల కారణంగా ఉప్పల్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఉప్పల్ జలమండలి మేనేజర్ సత్యనారాయణ తెలిపారు. సూర్యానగర్, సరస్వతి కాలనీ, వెంకటేశ్వర కాలనీ, విజయపురి కాలనీ, రామస్వామి ఫంక్షన్ హాల్, సాయిబాబానగర్, హనుమసాయినగర్, శాంతినగర్, సత్యనగర్, కురుమానగర్, ఉప్పల్ హిల్స్ ప్రాంతాల్లో నీటి సరఫరా ఉండదని తెలిపారు.

దోమల అదుపునకు ఫాగింగ్

మల్కాజిగిరి: దోమల నివారణకు మల్కాజిగిరి ఎంటమాలజీ విభాగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ముఖ్యంగా చెరువుకు సమీపంలో ఉన్న కాలనీలపై ప్రత్యేక దృష్టి సారించామని చీఫ్ ఎంటమాలజిస్ట్ దుర్గాప్రసాద్ తెలిపారు. కాలనీ సంఘాలు, కార్పొరేటర్లు సమాచారం ఇచ్చిన ప్రాంతాల్లో ఫాగింగ్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు కూడా లార్వాలు వృద్ధి చెందకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని కోరారు.

'దళిత బంధు'లో రాజకీయం తగదు



ఉప్పల్ చౌరస్తాలో నిరసన దీక్షా ముగింపులో మాట్లాడుతున్న మహిళా నాయకురాలు

జీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్

ఉప్పల్: దళిత బంధు పథకం అమలులో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాజకీయం చేస్తోందని, అర్హులను వదిలేసి టీఆర్‌ఎస్ కార్యకర్తలకే అమలు చేస్తోందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ విమర్శించారు. దళితులందరికీ దళిత బంధు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఉప్పల్ చౌరస్తా అంబేడ్కర్ నాలెడ్జ్ పార్కు వద్ద మంగళవారం 24 గంటల నిరసన దీక్షా ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దళిత బంధు పథకాన్ని రాష్ట్రంలో అర్హులైన దళితులకు ఇవ్వకుండా కేవలం పార్టీలోని వ్యక్తులకే కేటాయించడాన్ని ఆయన తీవ్రంగా తప్పు బట్టారు. ప్రజాధనాన్ని కేవలం బీఆర్‌ఎస్ కార్యకర్తలకే ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. హైకోర్టు ఆదేశాలను ఖాతరు చేయకుండా ఎమ్మెల్యేల సిఫార్సు మేరకే పథకానికి రాజకీయ రంగు పులిమి నిరుపేద దళితులను అణగదొక్కుతున్నారని విమర్శించారు. రాష్ట్ర ఖజానా నుంచి విడుదలవుతున్న నిధుల విషయంలో హైకోర్టు చీఫ్ జస్టిస్ జోక్యం చేసుకొని అందరికీ ఈ పథకం వర్తించేలా చర్యలు తీసుకోవాలని, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, దళిత బంధు విషయంలో పారదర్శకంగా ఉండాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేసి ప్రభుత్వం మెడలు వంచుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో హబ్సిగూడ కార్పొరేటర్ చేతన, రామంతాపూర్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి, జిల్లా నాయకులు శిల్పారెడ్డి, ఏచూరి యాదగిరి, గౌరిగే కృష్ణ, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదు'



కుమ్మరి బస్తీ పాదయాత్రలో నందికంటి శ్రీధర్

మల్కాజిగిరి: మల్కాజిగిరి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో అభియాన్ యాత్ర 25వ రోజుకు చేరుకుంది. పార్టీ జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ మంగళవారం మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని ముస్లిం బస్తీ, కుమ్మరి బస్తీ, నర్సింహారెడ్డినగర్, రాజీవ్‌గాంధీ నగర్‌లో పాదయాత్ర నిర్వహించారు. తెలంగాణ నినాదం, వాదంతో గద్దెనెక్కిన బీఆర్‌ఎస్ ప్రజలకు చేసిన మేలు ఏమీ లేదన్నారు. మౌలిక వసతులు కల్పించడంలో విఫలమయ్యారని, ప్రభుత్వ పాలన మేడి పండు చందం అన్న మాదిరిగా ఉందన్నారు. వెంకటేష్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, నర్సింగరావు, పోల్కం వెంకటేష్, గుత్తి చందర్, రాములు, అలీ, విఠల్, నరహరిగౌడ్ పాల్గొన్నారు.

హామీలను తుంగలో తొక్కిన ప్రభుత్వాలు

కాప్రా: ఎన్నికల సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హామీలు ఇచ్చి తుంగలో తొక్కాయని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ నేత రాగిడి లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్ నగరిగారి ప్రీతం, ఉప్పల్ బీ బ్లాక్ అధ్యక్షుడు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి అన్నారు. కాప్రా డివిజన్ పరిధిలోని వంపుగూడ విలేజ్, ఎల్లారెడ్డిగూడ, ఓల్డ్‌కాప్రా, నాయక్‌నగర్, శ్రీరామ్‌నగర్‌కాలనీ, గాంధీనగర్ కాలనీల్లో మంగళవారం హాథ్ సే హాథ్ జోడో యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే పేదల బతుకుల్లో వెలుగులు నిండుతాయంటూ ప్రచారం చేశారు. కార్యక్రమంలో పత్తి కుమార్, మేకల శివారెడ్డి, సీతారాంరెడ్డి, రాఘవరెడ్డి, అంజిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఆగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్రలో ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ నేత రాగిడి లక్ష్మారెడ్డి

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

కాప్రా: ప్రభుత్వం అందజేస్తున్న స్వయం ఉపాధి అవకాశాలను ముస్లిం మైనార్టీలు సద్వినియోగం చేసుకోవాలని కాప్రా సర్కిల్ డీసీ శంకర్ సూచించారు. రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మైనార్టీ నిరుద్యోగ యువతీ, యువకులకు అందజేస్తున్న సబ్సిడీ రుణాల దరఖాస్తులను మంగళవారం కాప్రా సర్కిల్ కార్యాలయంలో స్వీకరించారు. కార్యక్రమానికి చక్కటి స్పందన లభించింది. 369 మంది సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. రుణాలను సకాలంలో చెల్లించి బ్యాంకుల విశ్వాసాన్ని పొందాలన్నారు. తద్వారా భవిష్యత్‌లో మరిన్ని ప్రోత్సాహకాలు అందించేందుకు బ్యాంకులు ముందుకు వస్తాయన్నారు. జిల్లా మైనార్టీ కార్పొరేషన్ సూపరింటెండెంట్ బి.శ్రీనివాస్, వెంకటేష్, స్వామి, గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డితో పాటు వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.



స్వయం ఉపాధి రుణాల కోసం దరఖాస్తు చేసుకుంటున్న మైనార్టీలు

శివాజీపై దాడి కేసులో ముగ్గురి అరెస్టు

– పరారీలో మరో ముగ్గురు

కుషాయిగూడ: గత నెల 28న హెచ్‌బీకాలనీ కృష్ణ నగర్ కాలనీలో ఆర్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివాజీపై దాడికి పాల్పడ్డ ఘటనలో ముగ్గురు నిందితులు నానాజీ, సతీష్, అవినాష్‌ను అదుపులోకి తీసుకున్నట్లు మంగళవారం పోలీసులు తెలిపారు. పరారీలో ఉన్న మరో ముగ్గురి ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు పనులను ప్రారంభించండి

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని రాఘవేంద్రనగర్ కాలనీలో జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ పర్యటించారు. రాఘవేంద్రనగర్‌కు వెళ్లే ప్రధాన రోడ్డు డ్రైనేజీ మరమ్మతులు, వర్షపునీటి పైప్‌లైన్ వేయడంతో రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నదని, రోడ్డు వేయాలని అధికారులను కోరారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. రోడ్డు పనుల కోసం రూ.54 లక్షలు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. రాఘవేంద్రనగర్, అన్నపూర్ణ కాలనీ, ఇంద్రానగర్, రవీంద్రనగర్‌కు ఈ దారి ప్రధాన రోడ్డు అని, వెడల్పు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఈ రూప, ఏఈ లింగారావు, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు మేకల ముత్యంరెడ్డి తదితరులు ఉన్నారు,



రాఘవేంద్రనగర్‌లో రోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

మేడిపల్లి: పీర్జాదిగూడ నగర పాలక సంస్థ పరిధిలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి అన్నారు. 3వ డివిజన్ పరిధిలోని సాయిప్రియ కాలనీలో రూ.2.50 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న వాటర్ పైపులైన్ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా క్రమం తప్పకుండా నీటిని సరఫరా చేసే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం నగర పాలక సంస్థ పరిధిలో రిజర్వాయర్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని ఆ పనులు పూర్తయితే ప్రతి ఇంటికీ 24 గంటలు తాగునీరు ఇచ్చే విధంగా ప్రణాళికలు చేపడుతున్నట్లు చెప్పారు. పనులను త్వరితగతిన పూర్తిచేసి అన్ని కాలనీలకు నీటిని సరఫరా చేస్తామన్నారు. కార్యక్రమంలో 3వ డివిజన్ కార్పొరేటర్ బైటింటి శారద ఈశ్వర్‌రెడ్డి, మేనేజర్ రమ్య, బీఆర్‌ఎస్ నాయకులు బైటింటి ఈశ్వర్‌రెడ్డి కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పీర్జాదిగూడ జక్కా వెంకట్‌రెడ్డి అన్నారు. 3వ డివిజన్ పరిధిలో ఇంటింటికీ దోమల మందు పిచికారీ చేసే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, అందుకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బైటింటి శారద ఈశ్వర్‌రెడ్డి, కాలనీవాసులున్నారు.

పెండింగ్ పనులపై దృష్టి సారించాలి

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ పరిధిలో పెండింగ్ పనులపై దృష్టి సారించాలని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం మల్లాపూర్ వార్డు కార్యాలయంలో డీఈ రూప, ఏఈ స్రవంతితో కలిసి పలు అభివృద్ధి పనులపై సమీక్షించారు. థీమ్ పార్క్‌లో ఉన్న పెండింగ్ పనులు, పలు కాలనీల్లో చేపట్టాల్సిన సీసీరోడ్డు, డ్రైనేజీ పనులు, బాక్స్ డ్రైన్, ఈద్గాలో ప్లాట్‌ఫారం పనులకు కావాల్సిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను కార్పొరేటర్ ఆదేశించారు. మంజూరైన పనుల్లో వేగం పెంచాలన్నారు.

హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయాలి

లాలాపేట: హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయాలనీ హిందూ వాహినీ తెలంగాణ స్టేట్ కో కన్వీనర్ చంద్రకాంత్ పిలుపునిచ్చారు. లాలాపేటలోని మున్సిపల్ మైదానంలో మంగళవారం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు. శ్రీరామనవమి అనంతరం నిర్వహించే హనుమాన్ శోభాయాత్రను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్న నేపథ్యంలో అఖిలపక్షం నాయకులు పాల్గొనాలని కోరారు. ఈ నెల 6న సాయంత్రం ఓల్డ్ లాలాపేట దర్వాజమైసమ్మ దేవాలయం నుంచి శోభాయాత్ర ప్రారంభం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సాయి, అనీల్ యాదవ్, విమల్, విశాల్, సందీప్, మహేశ్, నాగరాజు పాల్గొన్నారు.

ట్రాలీ ఆటో బోల్తా

● డ్రైవర్‌కు గాయాలు

ఘట్‌కేసర్: పెయింట్ బాక్స్‌లతో వెళుతున్న ట్రాలీ టైర్ పేలడంతో బోల్తా పడిన సంఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. సీఐ అశోక్‌రెడ్డి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. జగద్గిరిగుట్టకు చెందిన చంద్రశేఖర్ కూకట్‌పల్లి నుంచి ట్రాలీ ఆటోలో పెయింట్ బాక్స్‌లు లోడ్ చేసుకుని భువనగిరికి బయల్దేరాడు. ఘట్‌కేసర్ ఓఆర్ఆర్ సమీపంలో ఆటో టైర్ పేలడంతో వాహనం బోల్తా పడింది. ఈ ఘటనలో గాయపడిన డ్రైవర్‌ను పోలీసులు ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మారుతీనగర్ కాలనీ అభివృద్ధికి పూర్తి సహకారం

కాప్రా: ఏఎస్‌రావునగర్ డివిజన్ మారుతీనగర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులను కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషా సోమశేఖర్‌రెడ్డి అభినందించారు. మంగళవారం వారిని ఘనంగా సత్కరించారు. మారుతీనగర్ కాలనీ అభివృద్ధికి పూర్తి సహకారం అందజేస్తానన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రేగలగడ్డ రవి, ఉపాధ్యక్షులు ఎస్.కె.ఖాసింఅలీ, ఏడుకొండలు, ప్రధాన కార్యదర్శి వై.సుధాకర్, సంయుక్త కార్యదర్శి రంగయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ పాన్ బాషా, కోశాధికారి దేవేందర్ రెడ్డి, నాయకులు శ్రవణ్‌కుమార్, మల్లేష్‌గౌడ్, విజయ భాస్కర్, సుభాన్, శ్రీనివాస్, రామారావు, వెంకటనారాయణ, ఏకనాథ్, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, కార్తీక్, వెంకటేశ్వరరాజు, వలి, ఆంజనేయులు సందీప్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మచారి అంత్యక్రియలు పూర్తి



బ్రహ్మచారి(ఫైల్)

ఉప్పల్: కెన్యా దేశం టాంజానియాలో వ్యవసాయం చేస్తున్న నగర వాసి బ్రహ్మచారి అంత్యక్రియలు మంగళవారం ముగిశాయి. వరంగల్ జిల్లా ఖానాపూర్ మండలం ధర్మారావుపేటకు చెందిన పడకంటి బ్రహ్మచారి(55) దంపతులు ఉప్పల్‌లోని కావేరినగర్‌లో నివాసం ఉంటున్నారు. మూడేళ్ల క్రితం కెన్యా దేశంలోని టాంజనియా రాష్ట్రానికి వెళ్లిన ఆయన అక్కడి వ్యవసాయ క్షేత్రాలను లీజుకు తీసుకుని మొక్కజొన్న పంటను సాగుచేస్తున్నాడు. పొలంలో పనులు చేస్తుండగా తేనెటీగలు దాడి చేయడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. సోమవారం అతడి మృతదేహాన్ని కావేరినగర్‌లోని స్వగృహానికి తీసుకువచ్చి మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు.

డంపింగ్ యార్డును ఎత్తి వేయండి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని డంపింగ్ యార్డును వెంటనే ఎత్తివేయాలని వైఎస్ఆర్‌టీపీ మేడ్చల్ నియోజకవర్గం కో–ఆర్డినేటర్ పాకాల దానియేల్ అన్నారు. మంగళవారం మేడ్చల్–మల్కాజిగిరి కలెక్టరేట్ కార్యాలయంలోని జాయింట్ కలెక్టర్ నర్సింహారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. డంపింగ్ యార్డు వల్ల సమీపంలోని కాప్రా, కీసర, ఘట్‌కేసర్, శామీర్‌పేట మండలాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వైఎస్ఆర్‌టీపీ నాయకులు వడ్డెపల్లి యాదిరెడ్డి, తాడికొండ అశోక్, నర్సింహారెడ్డి, కోళ్ల మల్లేష్‌యాదవ్, హరికృష్ణ పాల్గొన్నారు.

